క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల సందడి



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

కె.కోటపాడు : కె.కోటపాడు హైస్కూల్లో ఆదివారం 38 ఏళ్ల క్రితం ఆ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు అపూర్వ కలయిక పేరిట కలుసుకున్నారు. 1984–85లో తాము చదివిన ఆ పాఠశాల మొత్తం కలియదిరిగి నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాబోధన చేసిన గురువులు డబ్బీరు సత్యనారాయణమూర్తి, సత్యారావు, కృష్ణమనాయుడు, కుల్లయ్యలతో పాటు ప్రస్తుత పాఠశాల హెచ్‌ఎం సూర్యనారాయమూర్తి, పీఎంసీ కమిటీ చైర్మన్ బోకం సత్యనారాయణలను పూర్వ ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామన్నారు.

చీడికాడలో కంటి వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

చీడికాడ: స్థానిక ఎంపీయూపీ స్కూల్‌లో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 164 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. కె.కె.పటిదర్(పటేల్) సమాజ్ వారి సహకారంతో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 70 మంది కంటి రోగులను కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసి, ఆస్పత్రికి తరలించారు. కె.కె.పటిదర్, సభ్యులు హరిచందన, శంకర్ ఫౌండేషన్ క్యాంప్ మేనేజర్ అరుణ్‌కుమార్, క్యాంపు కో ఆర్డినేటర్ సతీష్, నర్సింగ్ సిబ్బంది దేవి, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది సేవలందించారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష కిట్లు



కిట్లతో పదో తరగతి విద్యార్థినులు

రోలుగుంట: బుచ్చెంపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న 76 మంది విద్యార్థులకు ఆదివారం నవ యువతరం స్వచ్ఛంద సంస్థ పరీక్ష కిట్లు అందించింది. పరీక్ష అట్ట, జామెట్రీ బాక్స్, పెన్నులు, పెన్సిల్, రబ్బరు, స్కేల్ పౌచ్‌ను అందజేశారు. పరీక్షల సమయంలో తీసికోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై విద్యార్థులకు సంస్థ నిర్వాహకులు లక్ష్మీనారాయణ, రమణ, బుజ్జి అవగాహన కల్పించారు.

పలు గ్రామాల్లో భారీ వర్షం

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 3 గంటల వరకు ఎండ తీవ్రంగా కాసింది. ఆ తర్వాత ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై భారీ వర్షం పడింది. రోడ్లపై వర్షం నీరు పంట కాలువలను తలపిస్తూ ప్రవహించింది. పలు చోట్ల వర్షం నీరు నిల్వ చేరింది. వర్షంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు ఇబ్బందులు పడ్డారు.

వేసవి దుక్కులకు అనుకూలంగా వర్షం

ఎస్.రాయవరం : మండలంలో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. గడిచిన వారం రోజులుగా ఎండ తీవ్రతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న మండల ప్రజలకు వర్షం ఉపశమనం కలిగించింది. సుమారు 45 నిమిషాలు కురిసిన వర్షంతో గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మెరక ప్రాంతాల్లో వేసవి దుక్కులకు ఈ వర్షం అనుకూలం కావచ్చని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎంపీఈవోల సేవలు పొడిగించాలి

బుచ్చెయ్యపేట : గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు వ్యవసాయంలో పలు సూచనలు, సలహాలు అందిస్తున్న బహుళ ప్రయోజక విస్తరణాధికారుల (ఎంపీఈవో) సేవలను ప్రభుత్వం పొడిగించి ఆదుకోవాలని పలు గ్రామాల ఎంపీఈవోలు కోరారు. గత ఎనిమిదేళ్లుగా కాంట్రాక్ట్ పద్ధతిలో నెలకు రూ. 12 వేల వేతనంతో విధులు నిర్వహిస్తున్నామని జిల్లా ఎంపీఈవోల సంఘ నాయకుడు జి. నాగ శరత్‌కుమార్, శ్రీను, సంతోష్ తెలిపారు. మార్చి 31తో తమ కాంట్రాక్ట్ ముగిసిందని, 102 మంది ఎంపీఈవోల కాల పరిమితిని పొడిగించాలని కోరారు. అదే విధంగా తమకు రావాల్సిన ఇన్సెంటివ్‌ను కూడా తక్షణం విడుదల చేసి ఎప్పట్లా విధులు నిర్వహించేలా జీవో విడుదల చేసి ఆదుకోవాలన్నారు.

గెలుపే లక్ష్యంగా ముందుకు

- 'మా నమ్మకం నువ్వే జగన్' ను సమర్థవంతంగా చేపట్టాలి
- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దిశా నిర్దేశం
- సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమీక్షా సమావేశం



సమావేశానికి హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు అంకిత భావంతో కృషి చేయాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు అన్నారు. ఈ మేరకు తారువ క్యాంప్ కార్యాలయంలో 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంపై జేసీఎస్ మండల కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో నియోజకవర్గ స్థాయిలో ఆదివారం సాయంత్రం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో కలిసి క్షేత్రస్థాయిలో సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. ఈ నెల 7 నుండి 14వ తేదీ వరకు ప్రతి ఇంటిని సందర్శించి ఆప్యాయంగా పలకరించి కష్ట సుఖాలు తెలుసుకోవాలన్నారు. ప్రజా మద్దతు పుస్తకంలోని ప్రశ్నలు చదివి సమాధానాల స్లిప్‌పై టిక్ చేయాలన్నారు. వారి అనుమతితో 8296082960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇప్పించడంతో పాటు ఫోన్ వెనుక, డోర్‌కు స్టిక్కర్ అతికించాలని సూచించారు. జేసీఎస్ మండల కన్వీనర్లు, ఎంపీపీ, జెడ్పీటీసీలు ఈ కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు ఉరుకుటి అప్పారావు, మాడుగుల, కె.కోటపాడు ఎంపీపీలు వేమవరపు ధర్మతేజ, రెడ్డి జగన్‌మోహన్, దేవరాపల్లి మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, దేవరాపల్లి, మాడుగుల జెడ్పీటీసీలు కర్రి సత్యం, కిముడు రమణమ్మ, పార్టీ అధ్యక్షుడు బూరె బాబురావు, తాళ్లపురెడ్డి రాజారామ్, నాలుగు మండలాల జేసీఎస్ మండల కన్వీనర్లు కేవీ రమణ, ఏటుకూరి అప్పలరాజు (రాజేష్), బొమ్మిశెట్టి శ్రీను, చైతన్య, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే ధ్యేయం



మాట్లాడుతున్న మండల కన్వీనర్ రమణ

మాకవరపాలెం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా గృహసారథులు పనిచేయాలని మండల కన్వీనర్ చిటికెల రమణ సూచించారు. రాచపల్లి, తామరం, పి.పి.అగ్రహారం సచివాలయాల పరిధుల్లోని వలంటీర్లు, గృహసారథులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి గడపకూ వివరించాలన్నారు. ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, జెడ్పీటీసీ పెట్ల సత్యవేణి, పార్టీ మండల అధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్ మాట్లాడుతూ నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించి, వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయడమే అందరి బాధ్యతన్నారు. ఈ నెల 7 నుంచి ప్రారంభం కానున్న గృహ సందర్శన కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. రాచపల్లి మాజీ సర్పంచ్‌లు పెట్ల భద్రాచలం, దొరబాబు, తూర్పుకాపు సంఘ మండల అధ్యక్షుడు గొంతిన హరిబాబు, యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాణీశాంతారామ్

గొలుగొండ: ప్రజలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలపై ఈనెల 7 నుండి గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని, ప్రజల అభిప్రాయం తెలుసుకోవాలని మండల గ్రామ సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు కొరుప్రోలు పాణీశాంతారామ్ తెలిపారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కృష్ణదేవిపేట, నాగాపురం గ్రామాల్లో గృహ సారథులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్‌యార్డు చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, జెడ్పీటీసీ సభ్యుడు సుర్ల గిరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు లెక్కల సత్యన్నారాయణ, గృహసారథులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ జయంతికి ఏర్పాట్లు



ఎంఆర్‌పీఎస్ సభ్యులుతో కొల్లి చిన ప్పారావు, ఘాటీలు

మాడుగుల: మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ 116వ జయంతి వేడుకలు ఈ నెల 5న మాదిగ పల్లెల్లో ఘనంగా నిర్వహించాలని ఎంఆర్‌పీఎస్ అనకాపల్లి జిల్లా గౌరవ అధ్యక్షుడు కొల్లి చిన అప్పారావు పిలుపునిచ్చారు. ఎం.కోడూరులో ఆదివారం ఎంఆర్‌పీఎస్ సభ్యులతో ఆయన మాట్లాడారు. ఈ వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నాయని, అనకాపల్లి జిల్లాలో కూడా ఘనంగా నిర్వహించాలని సభ్యులకు సూచించారు. అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి ఎలుసూరి ఘాటీలు, ఎంఆర్‌పీఎస్ నాయకులు ఎలకా రాజేష్, కండెల్ల ఈశ్వరరావు, కంటి పాము ఈశ్వరరావు, కె.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల పండగ



ఈత మట్టలతో పట్టణంలో ఊరేగుతున్న దైవజనులు

నర్సీపట్నం: పట్టణంలో దైవజనులు మట్టల ఆదివారం పండగను ఘనంగా జరుపుకున్నారు. గుడ్‌ఫ్రైడే ముందు వచ్చే జయప్రవేశ ఆదివారాన్నే మట్టల ఆదివారం పండగగా క్రైస్తవులు జరుపుకోవటం ఆనవాయితీ. గచ్చపు వీధి యేరూషలేము ప్రార్థన మందిరంలో ఈ వేడుకను ఘనంగా జరుపుకున్నారు. పిల్లా, పాపలతో దైవజనులు యేసుక్రీస్తు కీర్తనలు పాడుకుంటూ ఈత మట్టలు పట్టుకొని పట్టణంలో ఊరేగారు. ప్రార్థన మందిరానికి చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మాకవరపాలెంలో.. గ్రామాల్లో మట్టల పండగను క్రైస్తవులుఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం మండలంలోని రాచపల్లి, కొండలఅగ్రహారం, తామరం, పైడిపాల తదితర గ్రామాల్లో క్రైస్తవులు వీధుల్లో మట్టలు చేతపట్టి తిరిగారు. మట్టల పండగ విశిష్టతను పాస్టర్లు వివరించారు.

హైస్కూల్ కాలనీకి మహర్దశ

- రూ. కోటీ 3 లక్షల నిధులు మంజూరు



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ రామధర్మజ, సర్పంచ్ కళావతి

మాడుగుల: స్థానిక హైస్కూల్ కాలనీలో 21 సీసీ రోడ్లతో పాటు డ్రైనేజీలకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు కృషి ఫలితంగా సుమారు రూ. కోటీ 3 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. ఎంపీపీ రామధర్మజ, సర్పంచ్ ఎడ్ల కళావతి ఆదివారం పనులు ప్రారంభించారు. ఇన్నాళ్లకు తమ కల ఫలించిందని కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, కోఆప్షన్ మెంబరు షేక్ ఉన్నీషా బేగం, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, వార్డు మెంబరు అచ్యుతం, కాలనీవాసులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణం

నక్కపల్లి: ప్రముఖ ప్రాచీన శివాలయం ఉపమాక శ్రీ భువనేశ్వరి సమేత లక్ష్మణేశ్వర స్వామి ఆలయంలో శివ పార్వతుల కల్యాణం శనివారం అర్ధరాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. అంతకుముందు స్వామివారి ఆలయంలో విశేష హోమాలు నిర్వహించారు. స్వామివారిని పల్లకిలో ఊరేగించారు. ఎదురు సన్నాహ మహోత్సం ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, వెలవలపల్లి మహేష్ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ప్రముఖ తెలుగు పండితురాలు డాక్టర్ వేదాల గాయత్రీదేవి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి భజన పోటీలు రేపు

మాడుగుల రూరల్: ఈ నెల 4న కె.జె.పురం పాలగెడ్డ వద్ద గల బాలాంజనేయ స్వామి తీర్థం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉదయం 10 గంటల నుండి ఆలయం వద్ద బైటో భజన జరుగుతుందని, ఈ పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 3వ తేదీ సోమవారం సాయంత్రం లోగా తమ నామినేషన్ ఫీజు రూ.200 ఆలయ కమిటీకి చెల్లించాలని చెప్పారు. భజన పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.12,116, ద్వితీయ బహుమతిగా రూ.8,116, తృతీయ బహుమతిగా రూ.6,116ను దాతల సహకారంతో అందిస్తామని తెలిపారు. ఆలయం వద్ద భారీ అన్నదానం నిర్వహిస్తామన్నారు.

అనాథ పిల్లల గుర్తింపులో అంగన్‌వాడీ కార్యకర్తలు



అనాథ పిల్లల కోసం సర్వే చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త రామకృష్ణవేణి

నర్సీపట్నం: అనాథ పిల్లల వివరాలను సేకరించే ప్రక్రియను అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టారు. సీడీపీవో కె.మేరీ సువార్త ఆదేశాల మేరకు మిషన్ వాత్సల్య పథకం వర్తింపజేసేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు వారి పరిధిలోని పిల్లల వివరాలను సేకరిస్తున్నారు. తల్లిదండ్రులు చనిపోయిన పిల్లలు, వివిధ కారణాలతో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను గుర్తించేందుకు మున్సిపాలిటీలో ముమ్మరంగా సర్వే చేస్తున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని అర్హులైన పిల్లలకు అందేలా వారి కుటుంబ సభ్యులు బాధ్యత తీసుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్తలు సూచిస్తున్నారు. ఈ పథకం ద్వారా నెలకు రూ.4 వేల చొప్పున ప్రభుత్వ సాయం అందుతుందని కార్యకర్తలు వివరిస్తున్నారు.

విస్తారంగా మిరప సాగు



దాలివలసలో సాగులో ఉన్న మిరప పంట

కె.కోటపాడు : మిరప పంటను మండలంలో పలు గ్రామాల్లో రైతులు విస్తారంగా సాగు చేస్తున్నారు. సాగు కాలంలో 15 రోజులకు ఒక మారు నీటి తడుపు అందించాలని, ఈ విధంగా సాగు చేస్తే మొక్కనాటిన 45 రోజులకు మిరపపంట పూతదశకు చేరుకోవడంతో దిగుబడి ప్రారంభం అవుతుందని రైతులు తెలిపారు. మండలంలో దాలివలస, పింద్రంగి, గవరపాలెం, డి.అగ్రహారం, లంకవానిపాలెం, మర్రివలస, శృంగవరం, పాతవలస, కె.సంతపాలెం గ్రామాల్లో 150 ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలు పంటకు మేలు చేయనున్నట్లు రైతులు తెలిపారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



రాములోరి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

మాడుగుల: పురాతన పార్థసారధి స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని పూల నగలతో అలంకరించారు. పండితుల వేద మంత్రాల నడుమ అత్యంతం వైభవంగా రాములోరి కల్యాణం జరిగింది. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని వీక్షించారు. పురాతన సంప్రదాయం ప్రకారం ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారదాచార్యులు, వాసులు దేవాదయ ధర్మాదయ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఐదు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాలు కల్యాణంతో ఘనంగా ముగిశాయి.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ లక్ష్మీనారాయణ



విద్యార్థులు పరీక్ష రాసేందుకు సిద్ధం చేసిన బెంచీలు

మాడుగుల రూరల్: పది పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్థానిక ఎంఈవో బి. దేముడమ్మ ఆదివారం తెలిపారు. మండలంలో తాటిపర్తి టీడబ్ల్యుఏహెచ్ స్కూలు, మాడుగుల ఆర్ సీఎం పాఠశాల, మాడుగుల జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, ఒమ్మలి జిల్లా పరిషత్ హైస్కూలు, కేజేపురం జిల్లా పరిషత్ హైస్కూళ్లలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 733 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరువుతున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఉదయం 9 గంటలకల్లా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

నాతవరం: పదిపరీక్షలు జరిగే కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని నాతవరం ఎస్‌ఐ డి. లక్ష్మీనారాయణ తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాతవరం హైస్కూల్లో 320 మంది, డి.యర్రవరం హైస్కూల్లో 246 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు.

చీడికాడ మండలంలో..

చీడికాడ: మండలంలో మూడు పరీక్షా కేంద్రాల్లో పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్థానిక ఎంఈవో బి. గంగరాజు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతు మండలంలో కోనాం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, మంచాల మోడల్ స్కూలు, చీడికాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 555 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. కోనాం కేంద్రంలో తొలిసారి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో వుంటుందన్నారు.

రోలుగుంటలో..

రోలుగుంట: పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్థానిక ఎంఈవో సాయిశైలజ తెలిపారు. రోలుగుంట జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 330 మంది పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో వుంటుందన్నారు.

పగడ్బందీ ఏర్పాట్లు

నర్సీపట్నం: పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎంఈవో సాయిశైలజ తెలిపారు. నర్సీపట్నం మున్సిపాలిటీలో జెడ్పీ మెయిన్ స్కూల్, గవర్నమెంట్ హైస్కూల్, జెడ్పీ గరల్స్ హైస్కూల్, నారాయణ, చైతన్య, డాన్‌బాస్కో, సెంటాయన్స్, నర్సీపట్నం మండలంలో వేములపూడి పీఏఎం జెడ్పీ హైస్కూల్, ఏపీ మోడల్ స్కూల్లో మొత్తం తొమ్మిది పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రాల్లో 2,230 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారని తెలిపారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందన్నారు.

ఆర్టీసీలో ఉచిత ప్రయాణం..

ప్రభుత్వ ఆదేశాల మేరకు పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించవచ్చని ఆర్టీసీ డీఎం ధీరజ్ తెలిపారు. తమ సిబ్బందికి విద్యార్థులు హాల్ టిక్కెట్ చూపితే సరిపోతుందన్నారు. సాధారణ షెడ్యూల్లో ఎలాంటి మార్పు లేదన్నారు. ఎస్ఆర్‌పేట రూట్‌లోని వివిధ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థుల సౌలభ్యం దృష్ట్యా ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలకు రెండు బస్సులు ఏర్పాటు చేశామన్నారు.

అయ్యన్నకు అభివృద్ధి కనిపించదా..?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మండల నాయకులు

గొలుగొండ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు నూరు శాతం పథకాలు అందడంతోపాటు అవినీతి లేని పాలన కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని నర్సీపట్నం మార్కెట్ యార్డు చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, పార్టీ మండల అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ అన్నారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు లేనిపోని ఆరోపణలు చేయడంపై ఆదివారం పాత కృష్ణదేవిపేటలో విలేకరుల సమావేశం నిర్వహించారు. శనివారం రాత్రి పుత్తడిగైరం పేటలో టీడీపీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశం పుత్తడిగైరం పేటలో ఎటువంటి అభివృద్ధి పనులు జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు అయ్యన్న ఆరోపించడంపై మండల నాయకులు మండిపడ్డారు. పుత్తడిగైరం పేట సర్పంచ్ పత్తి రమణ మాట్లాడుతూ తను, తన భార్య 20 ఏళ్ల నుంచి గ్రామ సర్పంచ్‌గా ప్రజలకు మంచి సేవలు అందిచడం వల్లే ప్రజలు నమ్మకంతో ప్రతి ఎన్నికలో ఓటు వేసి గెలిపిస్తున్నారన్నారు. పుత్తడిగైరంపేటలో ఇప్పటి వరకు రూ.2.52 కోట్ల మేర అభివృద్ధి పనులు చేశామన్నారు. మాజీ మంత్రి అయ్యన్న తప్పుడు ఆరోపణలు మానుకోవాలని, లేకుంటే ప్రజలు మళ్లీ బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

డైవర్షన్ రోడ్డు పనులు వేగవంతం కావాలి



డైవర్షన్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట : భీమునిపట్నం, నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో వడ్డాది పెద్దేరు నదిలో జరుగుతున్న డైవర్షన్ రోడ్డు పనులు వేగవంతం కావాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆర్ అండ్ బీ అధికారులకు సూచించారు. ఆదివారం సాయంత్రం ఆయన రోడ్డు డైవర్షన్ పనులను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పనులు జరిపించాలని అధికారులకు సూచించారు. జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, వడ్డాది టౌన్ వైసీపీ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తి, మాజీ వైస్ ఎంపీపీ దాడి సూరినాగేశ్వరరావు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు దొండా సన్యాశిరావు, తైపురం సర్పంచ్ ముచ్చకర్ల శ్రీను తదితరుల పాల్గొన్నారు.

జీడిమామిడి రైతులపై ప్రకృతి కన్నెర్ర



ఆకాల వర్షాలకు నల్లగా మాడిపోతున్న జీడి పూత

నాతవరం: అకాల వర్షాలతో జీడిమామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు పంట దశలో ఉన్న జీడి తోట పిందే రాకుండా మాడిపోతోంది. అనకాపల్లి జిల్లాలో గల 24 మండలాల్లో 28 వేల హెక్టార్లలో రైతులు జీడిమామిడి తోటలు సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అధికంగా నాతవరం మండలంలో 3100 హెక్టార్లు, నక్కపల్లిలో 2678 హెక్టార్లు, రావికమతంలో 1685హెక్టార్లు, గొలుగొండలో 1428 హెక్టార్లు, నర్సీపట్నంలో 1265 హెక్టార్లు, మాకవరపాలెంలో 1239 హెక్టార్లు, యలమంచిలిలో 1118 హెక్టార్లలో సాగు చేయగా ఇతర మండలాల్లో సాధారణ విస్తీర్ణంలో పెంచుతున్నారు. అయితే పంట చేతికంది వచ్చే సమయంలో ప్రకృతి కన్నెర్ర చేయడంతో దిక్కతోచని స్థితిలో రైతులున్నారు. వాస్తవంగా ఈ ఏడాది మొదట్లో వాతావరణం బాగుండటంతో ఎకరానికి 300 కేజీలకు పైగా దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అయితే ప్రస్తుతం ఎలా ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై నర్సీపట్నం ఉద్యవనశాఖాధికారి సుదర్శన వివరణ కోరగా మొదట్లో జీడి మామిడి తోటల సాగు ఆశాజనకంగా ఉండేదని వర్షాల కారణంగా చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు.

రక్షణ గోడ లేని వంతెనతో భయం భయం



రక్షణ గోడ లేని కెనాల్ మార్గం

కె.కోటపాడు : గవరపాలెం–దాలివలస గ్రామాల మధ్య గల రైవాడ కెనాల్ మార్గంలో శ్లాబ్ కల్వర్ట్‌కు రక్షణ గోడ నిర్మాణం జరగక ప్రమాదకరంగా దర్శినమిస్తోంది. శ్లాబ్ కల్వర్ట్‌కు ఒక వైపు కెనాల్ మార్గం ఉండగా, రెండవ వైపు లోతట్టు ప్రాంతం ఉంది. దీంతో ఈ ప్రాంతం వద్ద వాహనదారులు ఆదమరిచి ప్రయాణిస్తే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు శ్లాబ్ కల్వర్ట్‌కు రెండు వైపులా రక్షణ గోడల నిర్మాణం చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.